సీఐడీ కస్టడీకి పర్తిబన్ మరియప్పన్

- 11మంది నిందితులకు బెయిల్ మంజూరు
- అదుపులో మరో ఆరుగురు

నాంపల్లి కోర్టులు, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : నకిలీ పాస్‌పోర్టు కుంభకోణంలో చెన్నైకి చెందిన ఏజెంట్ పర్తిబన్ మరియప్పన్‌ను 5రోజుల కస్టడీకి అప్పగిస్తూ 6వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం జైలు నుంచి నిందితుడిని సీఐడీ కార్యాలయానికి తరలిస్తారు. మరియప్పన్‌కు ఏజెంట్ గ్జేవియర్ సహాయంతో వీసాలు, పాస్‌పోర్టులను పొందే క్రమంలో మురళీధరన్ పరిచయమయ్యాడు. 16 మందికి భారతీయ పాస్‌పోర్టులను ఇప్పించాలని కార్తీక్‌సెల్వమ్ కోరడంతో మురళీధరన్ తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ నగరానికి చెందిన ఫేక్ అడ్రెస్‌లతో నకిలీ గుర్తింపు కార్డులు, ఓటరు, ఆధార్, సర్టిఫికెట్లను రూపొందించే పనిని ప్రధాన నిందితుడు సత్తార్‌కు అప్పగించారు. ఒక్కొక్కరి దగ్గర రూ.1.5లక్షలు వసూలు చేసి పంచుకున్నారు. ప్రస్తుతం సీఐడీ అదుపులో మరో ఆరుగురు ఉన్నట్లు సమాచారం. ఈ కేసులో 11 మందికి బెయిల్ మంజూరైంది. కరీంనగర్‌కు చెందిన చాంద్‌ఖాన్‌ను కోర్టు ఎదుట లొంగిపోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ లొంగిపోలేదు. ఏజెంట్ కార్తీక్ సెల్వమ్ పోర్చుగల్‌లో ఉండడంతో అరెస్టు చేయలేకపోయారు.

రహదారుల అభివృద్ధికి ప్రత్యేక కృషి

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ప్రేమ్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, ఫిబ్రవరి 5 : అంబర్‌పేట నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. సోమవారం అంబర్‌పేట డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో రూ.55 లక్షల తో కొత్తగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక వసుతుల కల్పనకు అధిక ప్రాధన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రహదారుల అభివృద్ధి, పుత్‌పాత్‌ల సుందరీకరణ పనులపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు వేగవంతం చేశామని ఆయన చెప్పారు. డ్రైనేజీ, మంచినీటి, వరదనీటి పైప్‌లైన్లు, వీధి దీపాల ఏర్పాటు, పార్కుల సందరీకరణ తదితర వసుతుల ఏర్పాటు పనులను ముమ్మరంగా చేపడుతున్నామని అన్నారు. అనంతరం బస్తీలో పాదయాత్ర చేస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కులగణనపై నిర్ణయం తీసుకోకపోతే దేశవ్యాప్త ఆందోళన

రవీంద్రభారతి, ఫిబ్రవరి 5 : కులగణనపై ప్రధాని మోదీ నిర్ణయం తీసుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని జాతీయ ఓబీసీ హక్కుల పరిరక్షణ పోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ అన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలో కులగణన సాధ్యం కాదని, రామకృష్ణ వేసిన కేసులో సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. కానీ కులగణన చేసి రిజర్వేషన్లు పెంచడం సాధ్యమౌతుందని బీహార్‌లో నితీస్ ప్రభుత్వం నిరూపించిందని తెలిపారు. సామాజిక న్యాయానికి అడ్డంకులు సృష్టించకూడదని, బీసీలకు న్యాయం చేయాలని ఢిల్లీలోని ఆంధ్రా, తెలంగాణ భవన్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, కిరణ్‌కుమార్ తదితరులు నిరసన దీక్ష చేపట్టారు.

ప్రజా వాణిలో ఫిర్యాదులు..

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు ఫిర్యాదు చేశారు. పీల్‌ఖానలో అక్రమ నిర్మాణంపై ఆయన ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయస్థానం ఆదేశాలిచ్చినా అక్రమ నిర్మాణాన్ని కూల్చడం లేదని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. – అబిడ్స్, ఫిబ్రవరి 5

- అంబర్‌పేట, ఫిబ్రవరి 5 : ప్రజావాణిలో సోమవారం మూడు సమస్యలు అధికారుల దృష్టికి వచ్చాయి. రెండు ప్రాపర్టీ టాక్స్‌కు సంబంధించినవి కాగా, ఒకటి టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన సమస్య. వాటిని ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు డీసీ మారుతీ దివాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వీరస్వామి, ఏఎంఓహెచ్ డా.జ్యోతిబాయి, ప్రాజెక్టు అధికారి రజిత, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి యాదాద్రి నృత్యోత్సవం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 5 : కళాకృతి నృత్యాలయ, సికింద్రాబాద్ వ్యవస్థాపక ప్రిన్సిపాల్ ఎం. భారతి సంచాలకత్వంలో ఈ నెల 6,7 తేదీలలో రవీంద్రభారతిలో నిర్వహించనున్న యాదాద్రి అఖిలభారత జాతీయ నృత్యోత్సవం గోడపత్రికను మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక ప్రిన్సిపాల్ ఎం.భారతి మాట్లాడుతూ.. పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ అవార్డు, ఆ స్థాయి గుర్తింపు పొందిన నిపుణులతో ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్టాత్మక నృత్యోత్సవానికి ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా క్లాసికల్ డ్యాన్స్ ఫెస్టివల్ చైర్మన్ , ద డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకులు బీఆర్ విక్రమ్‌కుమార్‌గౌడ్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని అన్నారు. ఈ ఉత్సవాలను సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎం.భారతి

జాతీయ కుష్టునివారణ దినోత్సవాల్లో భాగంగా సోమవారం అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో కుష్టు నివారణపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నేత లవంగు ఆంజనేయులు తదితరులు. – గోల్నాక, ఫిబ్రవరి 5

ఆల్ ఇండియా క్యారమ్స్ ఓపెన్ టోర్నమెంట్ విజేత ఆదిత్య

ఆల్ఇండియా క్యారమ్స్ ఓపెన్ టోర్నమెంట్ నగరంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ ఆర్ మీడియా వర్క్స్, ప్రాణహిత హాస్పిటల్స్, నుగాబెస్ట్, లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్, పెట్ ప్లానెట్, ఈబీ స్పోర్ట్స్ అండ్ సర్జికల్స్ ఆధ్వర్యంలో 12వ క్యారమ్ ఓపెన్ టోర్నమెంట్ జరిగింది. బాగ్‌అంబర్‌పేటకు చెందిన ఉప్పు సుధాకర్ ఫైనల్ మ్యాచ్‌కు రిఫ్రీగా వ్యవహరించారు. ఈ పోటీల్లో విజేతగా ఆదిత్య నిలువగా, రన్నరప్‌గా కె. శ్రీనివాస్ నిలిచారు. – అంబర్‌పేట, ఫిబ్రవరి 5

క్యాలెండర్ ఆవిష్కరణ

టీఎస్ఎస్‌పీ డీసీఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. సీజీఎం చక్రపాణి, సూపరింటెండెంట్ రాంజీ ముఖ్య అతిథులుగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో టీఎస్ఎస్‌పీడీసీఎల్ జేఏసీ చైర్మన్ పారునంది భాస్కర్, ప్రతినిధులు ఎ.రాములు, శశికాంత్, మైపాల్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వరరావు, శ్రీనివాస్‌గౌడ్, యాదాద్రి స్వామి, బ్రహ్మాచారి, నాగిరెడ్డి, ప్రవీణ్ రాజు, వనపర్తి సాయి, మహబూబ్‌నగర్ మోహన్‌కుమార్, నాగర్‌కర్నూల్ మల్లయ్య, రమేశ్, దేవరకొండ సైదులు పాల్గొన్నారు. – అంబర్‌పేట, ఫిబ్రవరి 5

అయోధ్యలోని రామమందిర్ హనుమాన్‌గడ్ వద్ద భాగ్యనగర్ అయ్యప్ప సేవాసమితి ద్వారా చేపట్టనున్న అన్నదాన కార్యక్రమం పోస్టర్‌ను బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ఆర్గనైజింగ్ సెక్రటరి యాదిరెడ్డి, బుచ్చిరెడ్డి, దేవర రాజేశ్వర్, వెంకటేషం గుప్తా, క్యాతం రాధాకృష్ణ, విజయ్‌భాస్కర్, రాకేశ్ శివశంకర్, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు. – అబిడ్స్, ఫిబ్రవరి 5

విచారణకు సిద్ధం..

టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్

కాచిగూడ, ఫిబ్రవరి 5: తనపై వచ్చిన ఆరోపణలపై ఏలాంటి విచారణకైనా సిద్ధమని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు ఎం. సత్యనారాయణగౌడ్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐపీఎంలోని కొంత మంది ఉద్యోగ సంఘాల నేతలు ఉద్దేశపూర్వకంగా తనపై ఆరోణలు చేశారని, నిరూపిస్తే ఉద్యోగానికి రాజీనామా చేస్తానని అన్నారు. తనపై ఆరోణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం నారాయణగూడలోని ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శివలీలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ నగర అధ్యక్షుడు కె.శ్రీకాంత్, ప్రతినిధులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేశ్‌గౌడ్, మల్లారెడ్డి, ఎ.శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, ఎం. శ్రీనివాస్‌రావు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పద్య సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవి డాక్టర్ దాసరి వెంకటరమణ

కంద మందారమాల పద్య సంపుటి ఆవిష్కరణ

ముషీరాబాద్, ఫిబ్రవరి 5: యాముజాల కళా సమితి, రాగ సప్త స్వరమ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లిలో సహజ కవి యాముజాల రామచంద్రన్ రచించిన వేంకటేశునికి పంచ సహస్ర రమణీయ కంద మందారమాల పద్య సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి డాక్టర్ దాసరి వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని పంచ సహస్ర రమణీయ కంద మందారమాల గ్రంథాన్ని ఆవిష్కరించారు. విశ్రాంత దూరదర్శన్ అదనపు డైరెక్టర్ జనరల్ రేవూరు అనంత పద్మనాభరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్. సుధాకర్‌రెడ్డి, వీఎస్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ మైదానంలో జావెద్‌అలీ గీతాలాపన

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో భారతీయ నేపథ్య గాయకుడు జావెద్‌అలీ గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ సలహదారు డాక్టర్ ప్రభాశంకర్, కన్వీనర్ ముఖైర్ హైదర్‌లు జావెద్ అలీని సన్మానించారు. – అబిడ్స్, ఫిబ్రవరి 5

ఆకట్టుకున్న హరికథా గానం

కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో విశ్రాంత ఐఎఎస్ అధికారి కేవీ రమణాచారి జన్మదినాన్ని పురస్కరించుకొని పద్మకాలనీ శంకరమఠంలో సోమవారం శ్రీనివాస కల్యాణం హరికథా గానం పలువురినీ విశేషంగా ఆకట్టుకుంది. విశ్వనాథ జయరాములు శ్రీనివాస కల్యాణ సన్నివేశాలను వివరించగా ఈ కార్యక్రమంలో విద్యుత్ రెగ్యులేటరీ మాజీ సభ్యుడు పీ రఘు, నవలా రచయిత ముదిగొండ శివప్రసాద్ పాల్గొని భాగవతార్‌ను సత్కరించారు. – ముషీరాబాద్, ఫిబ్రవరి 5

స్పీకర్ కు సన్మానం

రాష్ట్ర స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సౌత్ బృందం సత్కరించింది. క్లబ్ అధ్యక్షుడు లయన్ జోగిందర్ సింగ్‌ముజ్రాల్, కార్యదర్శి లయన్ అమరేందర్‌రెడ్డి, సర్వీస్ చైర్‌పర్సన్ లయన్ బాలాజీసింగ్ ఠాకూర్, డైరెక్టర్ లయన్ రవిశంకర్, సరోజిత్‌సింగ్ అరోరాలు స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. – అబిడ్స్, ఫిబ్రవరి 5

తెలంగాణ మిస్టర్ బాడీబిల్డింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

మెహిదీపట్నం ఫిబ్రవరి 5 : రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న మిస్టర్ బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్‌ను సోమవారం టోలిచౌకిలో ఎన్ ఎంఎం కన్‌స్ట్రక్షన్స్ ఎండీ, కార్వాన్ నియోజకవర్గం ఎంఐఎం నాయకుడు అబ్దుల్ సలాం ఖాలేదీ, నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 25 న మహబూబ్‌నగర్‌లో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు ఆసక్తి గల బాడీ బిల్డర్లు ఈ పోటీలలో పాల్గొన వచ్చని నిర్వాహకులు ఇమ్రాన్, షారుఖ్ తెలిపారు. వివరాలకు 9985525258, 6301296622 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహా శివరాత్రి జాగరణ్ సేవా సమితి కార్యవర్గం

ఫోటో నెంబర్ (5ఎబిడి5)

అబిడ్స్, ఫిబ్రవరి 5 : రహీంపురాలోని సత్తన్నగల్లి జాగరణ్ సేవా సమితి ఆధ్వర్యంలో మహా శివరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని జాగరణ్ సేవా సమితి నూతన అధ్యక్షుడు మాడిశెట్టి సదానందంగుప్తా అన్నారు. ఈ సందర్భంగా జాగరణ్ సేవా సమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా మాడిశెట్టి సదానందం గుప్తాను ఎన్నుకొని అనంతరం సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్‌గా జీఎన్ ప్రకాశ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రాజన్‌కుమార్, కార్యనిర్వహణ కార్యదర్శిగా పి.రంజిత్ కుమార్, కోశాధికారిగా బి.లక్ష్మీనారాయణ వర్మ, రాజేందర్ సింగ్, ఉపాధ్యక్షులుగా తోట శ్రావణ్‌కుమార్, నవీన్‌సింగ్, ప్యాట రాజ్‌కుమార్, జనగామ పాండు, తాడిశెట్టి నవీన్‌కుమార్, బూడిద రాజేందర్, లక్ష్మీనారాయణ, భాగేష్ సింగ్, నర్సింగ్‌రావుఎన్నికయ్యారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

కాచిగూడ, ఫిబ్రవరి 5 : డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. చెప్పల్‌బజార్ నుంచి లాల్‌బహదూర్‌స్కూల్ వరకు చేస్తున్న డ్రైనేజీ పనులను సోమవారం జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో రమేశ్‌యాదవ్, సన్యాసిరావు, భావన, వెంకటేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో బీసీలపై దౌర్జన్యం

కార్వాన్, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీసీల పై అధికారుల దౌర్జన్యం పెరిగిపోయిందని కార్వాన్ యాదవ సంఘంతో పాటు కార్వాన్‌లోని పలు బీసీ సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. కార్వాన్ యాదవ సంఘం అధ్వర్యంలో గుడి మల్కాపూర్ డివిజన్ విశ్వేశ్వర్ నగర్‌లో కార్వాన్ యాదవ సంఘంకు 1998-99లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 800 గజాల స్థలం కేటాయించింది. ఈ స్థలంలో సగం మేరకు శ్రీ క్రిష్ణ భవన్ పేరుతో యాదవ సంఘం నిర్మించుకున్నారు. మిగతా స్థలంలో గత ఏడాది షెడ్డును నిర్మించారు. అయితే స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు ఈ స్థలం తమదని ఆసిఫ్‌నగర్ రెవెన్యూ అధికారులకు తెలియజేయడంతో పాటు హైకోర్టు నుంచి స్టేటస్ కో ఆర్డర్ తీసుకున్నారు. అయితే సోమవారం మధ్యాహ్నం ఆసిఫ్‌నగర్ తాసీల్దార్ జ్యోతి తన సిబ్బందితో పాటు పోలీస్ బలగాలతో యాదవ సంఘం స్థలంలోని నిర్మాణాన్ని జేసీబీతో తొలగించారు. ఈ విషయమై సమాచారం అందుకున్న కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్ యాదవ్‌తో పాటు సంఘం ప్రతినిధులు అక్కడకు చేరుకొని తాసీల్దార్ జ్యోతితో తమ వద్ద హైకోర్టు నుంచి స్టేటస్ కో ఆర్డర్ ఉందని నిర్మాణాన్ని ఎలా కూలగొడతారని మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆమె వినిపించుకోలేదు. పైగా యాదవ సంఘం ప్రతినిధులను అరెస్టు చేయించింది. కార్వాన్ డివిజన్ కార్పొరేటర్ ఎం. స్వామియాదవ్, జియాగుడా కార్పొరేటర్ బోయిన దర్శన్‌తో పాటు గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండు యాదవ్, నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ, రాజెందర్ పాల్గొన్నారు.

టప్పాచబుత్రా పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న కార్వాన్ యాదవ సంఘం ప్రతినిధులతో పాటు బీసీ కుల ప్రతినిధులు

అధికారులు చురుకుగా పనిచేయాలి

మెహిదీపట్నం ఫిబ్రవరి5 :నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు చురుకుగా పనిచేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. సోమవారం కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్, టోలిచౌకి డివిజన్లలో ఎమ్మెల్యే, సర్కిల్ -13 డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, ఎంటమాలజీ, ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, విద్యుత్ , శానిటేషన్ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వీడీసీసీ రోడ్ల ఆధునీకీకరణ, మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌ల నిర్మాణం, పారిశుధ్య పనులపై అధికారులతో ఆయన చర్చించారు. నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్ , ఏఎంఓహెచ్ డాక్టర్ అనూరాధ పాల్గొన్నారు.

జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 5 : తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ విగ్రహాన్ని తెలంగాణ శాసనసభలో ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం నేతలు తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మధన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి చొల్లెటి కృష్ణమాచార్యులు, గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటచారి మాట్లాడారు. డి.వీరాచారి, శ్రీనివాసచారి, నాగారం భాస్కరాచారి పాల్గొన్నారు.

హారిజంటల్ విధానం వద్దని నిరసన

ముషీరాబాద్, ఫిబ్రవరి 5 :గురుకుల పాఠశాలల ఉద్యోగ పోస్టుల భర్తీలో హారిజంటల్ విధానం అమలు చేయకూడదంటూ పోటీ పరీక్షలు రాసిన మహిళా అభ్యర్థులు సోమవారం ఇందిరాపార్కు వద్ద నిరసన చేపట్టారు. గత ప్రభుత్వం గురుకులాల్లో ఖాళీగా ఉన్న 9,210 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించిందని, వాటి ఫలితాల కోసం ఎదురు చూ స్తున్న తరుణంలో కొంతమంది పురుష అభ్యర్థులు హారిజంటల్ విధానాన్ని అమలు చేయాలని కోర్టును ఆశ్రయించడం సరికాదన్నారు. ప్రభుత్వం గురుకుల పోస్టుల విషయంలో హారిజంటల్ విధానాన్ని అమలు చేస్తే మహి ళా అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని అభ్యర్థులు జ్యోస్నా, అస్మా, దీప్తి, సుజాత, మాధురి, ప్రసన్న లు అన్నారు. నోటిఫికేషన్ నింబంధనల ప్రకారం వర్టికల్ విధానంలోనే గురుకుల పోస్టులు భర్తీ చేయాలని, లేని పక్షంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

వాలీబాల్ చాంప్ సాట్స్ టీమ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అంబర్‌పేట ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన వాలీబాల్ టోర్నీలో సాట్స్ టీమ్ విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్లో సాట్స్ టీమ్ 25-23, 25-23తో అంబర్‌పేట ప్లేగ్రౌండ్ టీమ్‌పై విజయం సాధించింది. సాట్స్ టీమ్ ప్లేయర్లు జశ్వంత్‌రెడ్డి, టిల్లు ఆకట్టుకున్నారు. మరోవైపు మహిళల తుది పోరులో స్పోర్ట్స్ స్కూల్ జట్టు 26-28, 25-20, 15-8తో ఆదయ్య నగర్ ప్లేగ్రౌండ్ టీమ్‌పై గెలిచింది. విజేతలకు రూ.20,000, రన్నరప్ టీమ్‌కు రూ.15,000 నగదు ప్రోత్సాహం అందించారు.

'ఇండ్ల' బాధితులకు న్యాయం చేసేందుకు కృషి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 : ఇండ్లు కోల్పోయిన స్వామి వివేకానందనగర్‌బస్తీ వాసులకు న్యాయం చేసేందుకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానంద నగర్ బస్తీలో వారం రోజుల క్రితం రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు ఇండ్లను కల్చివేశారు. న్యాయం చేయాలని బాధితులు నిరాహార దీక్ష చేపట్టారు. సోమవారం ముఠా జయసింహ బస్తీ వాసులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండ్లు కూల్చవద్దని కలెక్టర్‌తో ఎమ్మెల్యే మాట్లాడినా కోర్టు తీర్పు వల్ల అది సాధ్యం కాలేదని అన్నారు. బస్తీలో ఉన్న 23 ఇండ్లు కూల్చారని, ఇండ్లు కోల్పోయిన కుటుంబాలకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్ కుమార్, నాయకులు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, ఎం.వి అశోక్, నితిన్, చాణిక్యరెడ్డి బస్తీ వాసులు దినేశ్, ఎంబి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు

బస్తీవాసులకు మద్దుతు తెలుపుతున్న బీఆర్ఎస్ నేత ముఠా జయసింహ

మల్లేపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

మెహిదీపట్నం ఫిబ్రవరి 5 : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. సోమవారం మల్లేపల్లి డివిజన్ ఆగాపురాలో ఆయన పర్యటించారు.

నాంపల్లి పీఎన్‌బీ నూతన బ్రాంచి ప్రారంభం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ): నాంపల్లి పంజాబ్ నేషనల్ బ్యాంకును అబిడ్స్‌లోని చిరాగ్ ఆలీ లైన్‌లో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయంలోకి మార్చినట్లుగా బ్యాంకు అధికారులు వెల్లడించారు. ఈ కార్యాలయాన్ని హైదరాబాద్ జోనల్ హెడ్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎన్‌బీవన్ మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని, అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను పొందేందుకు వీలుగా, సులభంగా ఆపరేట్ చేసేలా మొబైల్ యాప్‌ను తీర్చిదిద్దనట్లుగా తెలిపారు. సర్కిల్ హెడ్ ఎన్‌పీఎస్‌పీ రెడ్డి, నాంపల్లి బ్రాంచి మేనేజర్ మయూర్ గంధమ్వార్, అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్స్ తిరిగి అప్పగింత

అబిడ్స్, ఫిబ్రవరి5 : ఎగ్జిబిషన్ మైదానంలో పోగొట్టుకున్న పర్సును గోషామహల్ పోలీసులు అప్పగించిన ఘటన సోమవారం జరిగింది. నార్సింగి నుంచి సంపూర్ణ లక్ష్మి అనే మహిళ ఆదివారం ఎగ్జిబిషన్ సందర్శనకు వచ్చింది. హడావుడిలో సదరు మహిళ పర్సు పోగొట్టుకోగా.. ఆ పర్సును మహిళా కానిస్టేబుల్ గుర్తించి గోషామహల్ ట్రాఫిక్ సీఐ మహేశ్ ఆధ్వ ర్యంలో బాధితురాలికి అందజేశారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

కాచిగూడ, ఫిబ్రవరి 5: పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(60)సోమవారం మలక్‌పేట-కాచిగూడ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అతడు మృతి చెందాడు. వివరాలకు 8712568495లో సంప్రదించాలని కోరారు.